ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ - వాంకిడి

పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా తొక్కిగూడ గ్రామానికి చెందిన రాజక్కకు రూ.5వేల నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు శుక్రవారం ఎస్ఐ సాగర్ పంపిణీ చేశారు. గతంలో జంతువుల కోసం అమర్చిన కరెంటు వైర్ తగిలి కిందపడడంతో రాజక్క చూపు కోల్పోయింది. ఎస్ఐ ఆమె పరిస్థితికి చలించి పలుమార్లు సొంత ఖర్చులతో హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో చూపించి రెండు ఆపరేషన్లు చేయించి చూపు తిరిగి రప్పించడంలో కీలక పాత్ర పోషించారు. ఆమె దయనీయ పరిస్థితి చూసి సాయమందించిన ఎస్ఐ సాగర్‌ను సీఐ శ్రీనివాస్, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అభినందనలు తెలిపారు.



నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

ఆదిలాబాద్

శనివారం | జులై 13, 2024 | www.navatelangana.com

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ - పెంచికల్‌పేట్



మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన సిడాం ఆకాష్(23) గురువారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం..సిడాం శంకర్-యశోద దంపతుల కుమారుడు ఆకాష్ మంచిర్యాలలో డిగ్రీ చదువుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. ఇటీవల విడుదలైన జీడీ కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగం రాలేదనే బాధతతో తీవ్ర మనస్తాపం చెంది ఉరేసుకున్నాడు. యువకుడి మరణంతో కుటుంబంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆసరా లబ్ధిదారులకు బకాయి చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఆసరా పెన్షన్‌దారులకు 8 నెలల బకాయిలు చెల్లించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రేగుంట కేశవ్ డిమాండ్ చేశారు. ఎల్లుండి నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఇదే విషయంపై చర్చించేలా చూడాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఆగస్టు ఒకటి నుండి ఆసరా పెన్షన్లు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటన స్వాగతిస్తున్నామన్నారు. ఇదే సందర్భంలో ఎనిమిది నెలల నుండి ప్రస్తుతం పెంచే మొత్తంతో లెక్క కట్టి వృద్ధులకు, వికలాంగులకు బకాయిలు చెల్లించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న వృద్ధులకు 7000, వికలాంగులకు 6000, వితంతువులకు 4000 రాష్ట్రంలో కూడా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బన్నమూర్తి, నాయకులు శ్రీను, ఎల్లమ్మ, పోచక్క, జాన్కుబాయి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ఉన్నత పాఠశాలలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. 2023లో తమ సర్వీస్ రెగ్యులరైజ్ కోసం వరంగల్‌లో నిరాహార దీక్షలు చేస్తున్న సందర్భంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిసిసి హోదాలో వచ్చి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు గుర్తు చేశారు. సర్వీస్ రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ నెరవేర్చే దిశగా ప్రయత్నం చేయకపోవడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆగస్టు 1న ప్రగతి భవన్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి దుర్గం సందీప్, నాయకులు దేవేందర్, మహేశ్వర్, నగేష్, సుభాష్, శ్రీనివాస్, స్వప్న, రాజమ్మ పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారులపై ఫిర్యాదు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

లింగాపూర్ మండలంలోని లెండిగూడ గ్రామంలోని ఆదివాసుల వద్ద ఇద్దరు అటవీశాఖ అధికారులు డబ్బులు వసూలు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ వెంకటకృష్ణకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన గిరిజనులు సాగర్, రాము తమ ఇంటికి గతంలో తలుపులు బిగించుకోగా పాత తలుపులను పట్టుకుని వారిరువురిని అపరాధ రుసం కట్టాలని వేధించారన్నారు. వారి నుండి రూ.30వేలు వసూలు చేశారన్నారు. చోర్పల్లి ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న అటవీశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ఆదివాసులకు న్యాయం చేయాలని కోరారు. లేనట్లయితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు రాము, సాగర్ ఉన్నారు.

బంబారా ఆశ్రమ పాఠశాలలో డ్రైడే

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని బంబారా బాలుర పాఠశాలను శుక్రవారం వైద్య శాఖ అధికారి రవిదాస్ సందర్శించి పాఠశాల ఆవరణలో డ్రైడేను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు దోమల ద్వారా వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, డైయేరియా, చికెన్‌గన్యా, మెదడువాపు, పరిసర ప్రాంతాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, ఏఎన్ఎం సునంద, ఆశావర్కర్లు లక్ష్మీ సరోజ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అజయ్‌కుమార్‌కు ఆర్ఎంపీ, పీఎంపీల సన్మానం

నవతెలంగాణ - వాంకిడి

పదవీకాలం ముగిసిన జడ్పీటీసీ అజయ్‌ను మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీలు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీల మండలాధ్యక్షుడు వినోద్‌కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి అశోక్, విజయ్, తుకారాం, రాజు, చంద్రశేఖర్, ప్రవీణ్, పోచాలు, రవీందర్, బాపురావు పాల్గొన్నారు.

రేషన్ దందా..!

- సరిహద్దులు దాటుతున్న పీడీఎస్ బియ్యం
- పెద్ద ఎత్తున మహారాష్ట్రకు తరలిస్తున్న వ్యాపారులు
- పోలీసులకు పట్టుబడుతున్నా ఆగని అక్రమ రవాణ
- దృష్టి సారించని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఈ వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలుగా విరాజిల్లుతుండటంతో అనేక మంది ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. కొందరు రేషన్ డీలర్లు లబ్దిదారుల నుంచి కొనుగోలు చేసి వ్యాపారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని లారీలు, ఇతరాత్ర వాహనాల ద్వారా వ్యాపారులు అక్రమ మార్గాన్ని మహారాష్ట్రకు తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేసిన బియ్యం ఇలా దుబారా అవుతున్నా కట్టడి చేయాల్సిన పౌరసరఫరాలశాఖ అధికారులు మామూలుగా తీసుకుంటూ వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల పోలీసులు రేషన్ బియ్యాన్ని పట్టుకుంటున్నా.. పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కళ్లకు గంతలు కట్టుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఆదిలాబాద్ పట్టణం తిర్పెల్లిలోని ఓ గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు వంద క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నాలుగు రోజుల క్రితం టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. రెండు రోజుల అనంతరం ఓ ఆటోలో తరలిస్తున్న 3క్వింటాళ్ల 80కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని ఆటోను సీజ్ చేసి ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఇలా రేషన్ బియ్యం అక్రమ రవాణకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పేదల కడుపు నింపేందుకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. ఉమ్మడి జిల్లాలో ఏండ్లుగా ఈ దందా కొనసాగుతున్నా..పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడటం లేదు. గతంలో బియ్యం సరఫరా చేసే వాహనాలు పక్కదారి పట్టిన సందర్భాలు ఉండగా ప్రభుత్వం జీపీఎస్ విధానం తీసుకొచ్చి అడ్డుకట్ట వేసింది. కానీ ఏదో రూపంలో రేషన్ బియ్యం అక్రమ రవాణ కొనసాగుతూనే ఉంది. ప్రజలకు ప్రభుత్వం కొన్ని నెలల నుంచి ఉచితంగా అందజేయగా.. రూపాయి కిలో చొప్పున ఒక్కో లబ్ధిదారుడికి 6కిలోల చొప్పున అందజేస్తోంది. అనేక మంది పేదలు ఈ బియ్యాన్ని వినియోగిస్తుండగా..కొందరు మధ్య తరగతి జనాలు మాత్రం సంబంధిత డీలరుకే కిలో రూ.10 చొప్పున విక్రయిస్తూ డబ్బులు తీసుకుంటున్నారు. ప్రతి నెలా వారి కోటా కింద వచ్చే బియ్యానికి బదులు డబ్బులు తీసుకుంటున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని కొందరు డీలర్లు బియ్యం అక్రమ రవాణా చేసే వ్యాపారులకు కిలో రూ.15 నుంచి రూ.20చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. బియ్యం వ్యాపారుల ఇలా సేకరించిన బియ్యాన్ని పెద్ద ఎత్తున పోగు చేసి లారీలు, ఇతర వాహనాల ద్వారా గట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్ర ప్రాంతానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అనేక చోట్ల కొనసాగుతున్న దందా..!

అక్రమ రేషన్ బియ్యం దందా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. కొందరు డీలర్ల నుంచి సేకరించిన బియ్యంతో పాటు కొందరు వ్యాపారులు రోజువారీగా ఆటోల్లో గ్రామాల్లో సంచరిస్తూ ఈ బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. పెద్ద ఎత్తున పోగు కాగానే ఈ బియ్యాన్ని మహారాష్ట్ర మండలాల్లో వివిధ మార్గాల ద్వారా అక్కడికి చేరవేస్తుంటారు. కాగజ్‌నగర్, మంచిర్యాల ప్రాంతాల నుంచి రైళ్లలోనూ ఈ బియ్యాన్ని తరలించిన సంఘటనలు ఉన్నాయి. పొరుగు రాష్ట్రంలో ఈ బియ్యాన్ని డిమాండ్ ఉండటం.. అధిక ధర పలుకుతుండటంతో కొందరు వ్యాపారులు దీనిని అనువైన వ్యాపారంగా మల్చుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడో ఓ చోట వాహనాల్లో తరలిస్తుండగా.. లేదంటే పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. కానీ ఈ అక్రమ రవాణాను కట్టడి చేయాల్సిన పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యాపారం సాగుతోందని ఆ శాఖ ఉన్నతాధికారులకు కూడా తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. జిల్లాలో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణపై జిల్లా పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారిని ఫోన్లో సంప్రదించగా.. ఆయన స్పందించలేదు.

ప్రతినిత్యం పారిశుధ్య పనులు చేయాలి : కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పారిశుధ్య పనులు నిత్యం చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైలో భాగంగా మహాలక్ష్మీవాడ, చిల్కూరి లక్ష్మీనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనికి కలెక్టర్ హాజరై ప్రజలకు అవగాహన కల్పిస్తు కరపత్రాలను అందించారు. ఓ ఇంట్లో కూలర్‌లో నీటి నిల్వ కారణంగా అందులో దోమల లార్వాలు ఉండడాన్ని గమనించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురికి కాలువల్లో బ్లీచింగ్, స్ప్రేతో పాటు నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేశారు. కాలనీకి వచ్చిన కలెక్టర్ ముందుగా మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సదర్శించి విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో డీఎంహెచ్ఓ డా. రాథోడ్ నరేందర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వల్ల అనేక వ్యాధులు ప్రబలుతాయన్నారు. నీరు నిల్వ కారణంగా దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయన్నారు. వాటిని నిరోధించడానికి ప్రజలు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలంలో కలుషిత నీరు, దోమల కారణంగానే అధికంగా వ్యాధులు వస్తాయన్నారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంతో డ్రైడే నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, జిల్లా మలేరియ అధికారి శ్రీధర్, సానిటరి ఇన్‌స్పెక్టర్ నరేందర్, సిబ్బంది ఉన్నారు.

అవిశ్వాసంలో కీలకపాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్, బీజేపీ

- జోగురామన్న, పాయల్ శంకర్ ఒక్కటే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ వైస్ చైర్మెన్ అవిశ్వాసంలో బీఆర్ఎస్, బీజేపీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాసేవ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరోపించిన విధంగా మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, ప్రస్తుత ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఒక్కటేన్న మాట ఇప్పుడు రుజువైందన్నారు. మున్సిపల్ రాజకీయాల్లో ఇద్దరు ప్రధాన భూమిక వహిస్తున్నారని అన్నారు. గతంలో కూడా ఇదే విధంగా ఎమ్మెల్యేగా ఉన్న జోగు రామన్న తన కుమారుడికి మున్సిపల్ చైర్మెన్ పదవీ కట్టబెట్టడంలో అప్పుడు బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న పాయల శంకర్ సహకరించారని ఆరోపించారు. ఇద్దరు ఒక్కటి కాదన్న తన ఆరోపణను అవాస్తవమని చెప్పాడానికి 18న జరిగే అవిశ్వాసంలో బీజేపీ కౌన్సిలర్లు రాకుండా ఉండాలని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న బ్యాంకు మేనేజర్‌కు సన్మానం

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మూడు సంవత్సరాల నుండి మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తూ మంచిర్యాల జిల్లా హాజీపూర్‌కు బదిలీపై వెళ్లిన రాజేశ్వర్‌రావును వ్యాపారస్తులు సన్మానించారు. పలువురు వ్యాపారస్తులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బ్యాంకు సేవలు అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు.



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేయూత హర్షించదగ్గ విషయం



నవతెలంగాణ - దహెగాం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేయూతనందించడం హర్షించదగ్గ విషయమని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇండియన్ ఫ్రెండ్స్ ఆఫ్ అట్లాంట ఆధ్వర్యంలో సమినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 మంది రవాణా సౌకర్యం లేని సుదూర ప్రాంత విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ హాజరై మాట్లాడుతూ రవాణా సౌకర్యం లేని గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యకు దూరం కావద్దనే సదుద్దేశంతో ఎన్ఆర్ఐ సంస్థ వారు చేపట్టిన ఈ కార్యక్రమం సంతోషకరమన్నారు. అనంతరం సంస్థ ఫౌండేషన్ సభ్యులు రాజేశ్వర్‌రావు, సునీత మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని విద్యార్థులు రవాణా సౌకర్యాలు లేక విద్యకు దూరమవుతున్నారనే ఉద్దేశంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు మంచి మేధస్సు కలిగి ఉండి ఆర్థిక, ఇతరాత్ర కారణాల చేత చదువుకోలేని పరిస్థితి ఉంటే తమ ఫౌండేషన్ తరపున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఉచితంగా సైకిళ్లను అందజేసిన ఫౌండేషన్ సభ్యులకు విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, యువ సంఘం అధ్యక్షురాలు సుశీల, ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌బాబు, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఏటూకూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు కటకం మధుకర్, భాగ్యలక్ష్మీ, వీరశంకర్, లతీఫ్, శ్రీనివాస్, మహేష్, పంచాయతీ కార్యదర్శి నరేష్, నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలల అభివృద్ధికి అమ్మ ఆదర్శ పాఠశాల పథకం



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి అమ్మ ఆదర్శ పాఠశాల పథకం చేపడుతున్నట్టు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం మండలంలోని తుంగమడగు గిరిజన ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల భవనాన్ని పర్యవేక్షించారు. మిగిలిన పనులు వారం లోపు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ ఐకేపీ అధికారులు మహిళా సమాఖ్య సంఘం అధ్యక్షులు, ఎంపిడిఓలు ఈ పథకం అమలులో కీలక పాత్ర వహించాలని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పథకం గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో అములు చేయడం శుభపరిణామం అని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు రాథోడ్ సారిక పాల్గొన్నారు.

నేర రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేర రహిత సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని సీఐ సతీష్ అన్నారు. మండలంలోని రవిచంద్ర కాలనీలో వాంకిడి సిఐ శ్రీనివాస్, రెబ్బెన సిఐ చిట్టిబాబుతో కలిసి కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ఇండ్లను తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత అన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, యువత చెడు అలవాట్లకు గంజాయి, మద్యం, డ్రగ్స్ లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకరావాలని లేదా 100 నంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలన్నారు. కాలనీలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యస్ఐ లు రాజేశ్వర్, ప్రవీణ్, సాగర్, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక టీంల ఏర్పాటు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కొరకు పదిమంది పోలీస్ సిబ్బంది చొప్పున రెండు టీంలను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ డివి శ్రీనివాసరావ్ తెలిపారు. ఈ రెండు ప్రత్యేక టీములు ఆసిఫాబాద్‌టౌన్, కాగజ్‌నగర్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పనిచేస్తాయని తెలిపారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ యాక్సిడెంట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రత్యేక టీమ్‌లు ప్రతిరోజు వెహికల్ చెకింగ్ చేస్తాయని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని సత్తనపల్లి గ్రామానికి చెందిన చిలికిబాయి ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధం అయ్యింది. శుక్రవారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. షార్ట్ సర్క్యూట్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. త్వరలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యం, కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నాటిన మొక్కలను పరిరక్షించాలి

నవతెలంగాణ-సారంగాపూర్

నాటిన మొక్కలను పరిరక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలో మెగా ప్లాంటేషన్ డే సందర్భంగా మండలంలో 40,450 మొక్కలు ఒకే రోజు నాటారు. అందులో భాగంగా చించోలి(బి) గ్రామంలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రవీందర్ రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీ కాంతారావు, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి సురేష్, ఏపీఓ లక్ష్మారెడ్డి, ఈసీ సాగర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎఫ్ఎ నసీమ బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్



నవతెలంగాణ-నిర్మల్

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని వార్డు నంబర్ 33లో శుక్రవారం పర్యటించారు. కాలనీ అంతటా కాలి నడకన తిరుగుతూ మురుగు నీటి కుంటలను, కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నాళాల వెంబడి గుబురుగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించేశారు. దోమలు వృద్ధి చెందకుండా మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేశారు. ప్రతీ శుక్రవారంతో పాటు మంగళవారం సైతం డ్రై డేను పాటించాలని, డెంగ్యూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలలో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ కవర్లు, వాడిన టీ కప్పులు, ఇతర నీటి నిలువలు గల పాత్రలను ఎప్పటికప్పుడు తొలగించాలని అన్నారు. ఇండ్లలో వాడే కూలర్స్, ఫ్రిజ్, ఏసీలలో నీరు నిల్వ లేకుండా శుభ్రపర్చుకోవాలని అన్నారు. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రిలో వైద్య చికిత్స తీసుకోవాలని కోరారు. చైర్మెన్ వెంట సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, జవాన్ శేఖర్, కాలనీ వాసులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

విద్యుద్ఘాతంతో ఎద్దు మృత్యువాత



నవతెలంగాణ-కుభీర్

ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో ఎద్దు మృత్యువాత పడ్డ సంఘటన శుక్రవారం మండలంలోని రంగశీవిని గ్రామంలో చోటుచేసుకుంది. రైతు కదం దిగంబర్ పటేల్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం గ్రామ పంచాయతీ భవనం పక్కన ఉన్న వ్యవసాయ క్షేత్రంలో పత్తి పంటలో కలుపు మొక్కలు తొలగించేందుకు ఎద్దుల సాయంతో అరక కొడుతుండగా వ్యవసాయ క్షేత్రంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పక్కన ఉన్న సపోట్ తీగకు ఎద్దు తగలడంతో విద్యుద్ఘాతానికి గురై తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. రైతు దిగంబర్ పటేల్ కండ్ల ముందే అరక నడుస్తున్న ఎద్దు మృతి చెందడం చూసి రైతు కంటతడి పెట్టారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. నష్టపోయిన రైతుకు నష్ట పరిహారం అందించేలా కృషి చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని రైతు తెలిపారు.

పురుగులమందు తాగి ఆత్మహత్య

నవతెలంగాణ-కుభీర్

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చాత గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాత గ్రామానికి చెందిన సాయిలు(55) ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో పురుగులమందు తాగి మృతి చెందాడు. మృతుడు గత కొన్ని రోజుల నుంచి ప్రతి రోజు మద్యం తాగుతుండేవాడు. గురువారం బాసర మండలం కౌట గ్రామానికి కుటుంబ సభ్యులు వెళ్లడంతో సాయిలు ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. దీంతో ఇంట్లో ఉన్న పురుగులమందు తాగి అత్తమ్మ అయిన శేషకాల బాయికి విషయం చెప్పగా వెంటనే బైంసా ఆస్పత్రికి తరలించి, అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కొరకు నిజామాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుమారుడు అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రవీందర్ తెలిపారు.

ఈత చెట్లతో గౌడ కులస్తులకు ఉపాధి



నవతెలంగాణ-తాంసి

ఈత మొక్కలు నాటడం ద్వారా గౌడ కులస్తులు ఉపాధి పొందుతారని ఎక్సైజ్ శాఖ డీపీఈఓ హిమశ్రీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్రం ప్రవేశపెట్టిన వన మహోత్సవం మొక్కలు నాటే కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఎక్సైజ్ అధికారులతో పాటు మండలంలోని కల్లుగీత గౌడ కులస్తులతో కలిసి మండల కేంద్రంలో ఈతమొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి యేట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. వివిధ రకాల మొక్కలను నాటడంతో పాటు ఈత మొక్కలు నాటడంతో ఆ మొక్కలు చెట్టుగా ఎదిగిన తర్వాత గౌడ కులస్తులకు కుల వృత్తిలో భాగంగా ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కల్తీ తెల్లకల్లు అరికట్టాలంటే ప్రతి గ్రామంలో ఈత చెట్లను నాటాలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గౌడ కులస్తులకు అన్ని రకాల అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ విజేందర్, ఎక్సైజ్ సబ్ ఇన్స్‌పెక్టర్ సుధాం, సిబ్బంది గిరి, లత, నాయకులు రామన్న యాదవ్, నరేష్, బీసీ సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, రితీష్‌గౌడ్, నాందేవ్‌గౌడ్, వివిధ గ్రామాలకు చెందిన కల్లు గీత గౌడ కులస్తులు పాల్గొన్నారు.

హాస్టల్ తరలించొద్దని విద్యార్థుల వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాల క్యాంపస్ ఉన్న బీసీ హాస్టల్‌ను తరలించకూడదని అక్కడే ఉంచాలని హాస్టల్ విద్యార్థులు కోరారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవిని ఆమె కార్యాలయంలో ఏబీవీపీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తాము వేసవి సెలవులకి ఇంటికి వెళ్లినప్పుడు తమకు సమాచారం ఇవ్వకుండా హాస్టల్‌ను అక్కడి నుంచి వేరే చోటికి తరలించారన్నారు. క్యాంపస్ ఉన్న హాస్టల్‌లో అన్ని సౌకార్యాలు ఉన్న కూడా కాని వేరే స్థలానికి తరలించారన్నారు. ప్రస్తుతం హాస్టల్‌కు కళాశాలకు చాలా దూరంగా ఉండటం వలన రవాణా ఖర్చు అవుతుందని ఇబ్బందులు ఎదుర్కొంటున్నమని పేర్కొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిగంబర్



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజురీయంబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిగంబర్ అన్నారు. శుక్రవారం ఆర్‌డీఓ భుజంగరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గత ఆరేండ్ల నుంచి విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సంవత్సరానికి రూ.14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్ షిప్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. వీరికి సంవత్సరానికి రూ.3 వేల కోట్లు అవసరమవుతాయని తెలిపారు. కానీ 2019 నుంచి ఇప్పటి వరకు బకాయిలు పేరుకొని ఉన్నాయని విమర్శించారు. 2019-20 రూ.800 కోట్లు, 2020-21 రూ.2,356 కోట్లు, 2021-22 రూ.2100.43 కోట్లు, 2022-23 రూ.2958.14 కోట్లు మొత్తం రూ.8214.57 కోట్లు ఫీజుల బకాయిలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులు ఆందోళనలు చేసినప్పుడు టోకెన్లు జారీ చేయడం తప్ప ట్రెజరీల నుంచి ఒకరూపాయి కూడా నిధులు విడుదల చేయడం లేదని అన్నారు. ప్రయివేట్ యాజమాన్యాలు ఫీజులు రాలేదనే పేరుతో విద్యార్థులకు సర్టిఫికేట్స్ ఇవ్వడం లేదని విమర్శించారు. ఉన్నత చదువులకు వెళ్లాలనే విద్యార్థులు తల్లిదండ్రులు సర్టిఫికెట్స్ కోసం అప్పులు చేస్తున్న దుస్థితి తెలంగాణ రాష్ట్రంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యాలు సైతం కళాశాల నడపడానికి బయట నుంచి అప్పులు తెచ్చామని, ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలలు మూతవేసే పరిస్థితి ఉందని వాపోతున్నారని వెల్లడించారు. తక్షణమే పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, అరవింద్, మోహన్, రవి, సోమేష్, రాహుల్, కార్తీక్ పాల్గొన్నారు.

మానవ మనుగడకు చెట్లే జీవనాధారం

- విద్యతోనే సమాజంలో గుర్తింపు
- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

మానవ మనుగడకు చెట్లే జీవనాధారమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేబి కాంప్లెక్స్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ బాలికల కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అధికారులు, విద్యార్థులు, మండల నాయకులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెట్లతోనే మానవ జీవనం ముడిపడి ఉందని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు వన మహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రపంచంలో వాయు కాలుష్యం, జల కాలుష్యం, భూకాలుష్యం జరగడానికి మనిషే కారణమని, తన సొంత స్వలాభం కోసం చెట్లు నరికి వేస్తున్నాడని అన్నారు. చెట్లను నరకకూడదని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు జరగకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని పేర్కొన్నారు. విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు .చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, చదువును మధ్యలో ఆపకూడదని విద్యార్థులకు సూచించారు. పట్టుదల చదివితే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. గొప్ప లక్ష్యాలను పెట్టుకోని ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, డాక్టర్లు, పోలీసులు, రాజకీయ నాయకులు కావాలని అన్నారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రయివేటు రంగాలలో రాణించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించి, వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సవారీ బంగ్లా షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని చర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సవారీ బంగ్లా షెడ్డును శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై బంగ్లా షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్తుల కోరిక మేరకు షెడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించామని అన్నారు. షెడ్డు నిర్మాణ పనులను సకాలంలో నిర్మించినందుకు గ్రామస్తుల ఐక్యతను కొనియాడారు. ప్రభుత్వం లేకపోయినప్పటికీ తనను అధిక మెజారిటీతో గెలిపించినందుకు తన వంతుగా ఎల్లప్పుడూ సహకారాలు అందిస్తానని తెలిపారు. పీఏసీఎస్ చైర్మెన్ ఎల్మ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేను అడిగిన వెంటనే బంగ్లా షెడ్డును మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, యువ నాయకులు అభిరాం రెడ్డి, జనాక్ పటేల్, అబ్దుల్లా, రమాకాంత్, ప్రమోద్, గంగాధర్, సుదర్శన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రాంబాయి, పల్లవి, లక్ష్మణ్, నర్సిములు, రాంరెడ్డి, నారాయణరెడ్డి, ప్రీతమ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తిరుమల్‌గౌడ్, పాండురంగ్, రమేష్, విజయ్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిడాం శంభు వర్ధంతి కరపత్రాల విడుదల



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ హక్కుల నాయకుడు, ఆదివాసుల తొలితరం ఉద్యమకారుడు అమరుడు సిడాం శంబు వర్ధంతిని విజయవంతం చేయాలని శుక్రవారం ఆదివాసీ నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. మండల కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో మాజీ ఎంపీపీ పంద్రా జైవంతురావు, శంభు తనయులు సిడాం లచ్చు పటేల్, సిడాం సోనేరావు, సిడాం శేషుల ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించనున్న శంభు వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జైవంత్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులతో పాటు ఉమ్మడి రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలలో పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, శంభు ఉద్యమాలు చేయడం వల్లనే ప్రభుత్వం 2006లో అటవీ హక్కుల చట్టం తెచ్చిందనీ అన్నారు. తుడుం దెబ్బ వ్యవస్థాపన చేసి ఉద్యమాలు చేయడం ద్వారా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పోడు భూములకు అటవీ హక్కు పత్రాలు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశారని అన్నారు. గిరిజన ప్రాంతాలలో ఆదివాసి చట్టాలు అమలు చేయడానికి ఆయన ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఈనెల 20న ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడలో నిర్వహించనున్న శంభు వర్ధంతి కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఆదివాసీ గిరిజనులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో తొడసం కోసుబాయి, ఆత్రం తిరుపతి, మడావి మోతీరాం, ఆత్రం లక్ష్మణ్, మంగం జుగాదిరావు, సాజిద్ లు పాల్గొన్నారు.

జన జీవనానికి మూలం మొక్కలే

- ఎస్సై సక్రియ నాయక్

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర గ్రామంలో శుక్రవారం 75వ వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిగా ఎస్సై సక్రియ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనజీవనానికి మూలకారణం మొక్కలే అని కొనియాడారు. అనంతరం ఎఎస్సైతో కలిసి గుంతను తవ్వి మొక్కను నాటారు. ఈ తరుణంలో గ్రామస్తులు 2230 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ దిగంబర్, మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, బీజేపీ జిల్లా కార్యదర్శి నల్ల రమేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఎఫ్ఏ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఖానాపూర్

పర్యావరణ సంరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో వన మహోత్సవ కార్యక్రమానికి ఆయన అధికారులు నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలు ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి మహావృక్షమయ్యే వరకు కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. సకల జీవరాసులకు స్వేచ్ఛమైన ప్రాణవాయువును అందించే చెట్లను నరకకుండా ఉండాలని, అప్పుడే ప్రకృతి వైపరీత్యాలను అరికట్టగలమని అన్నారు. రైతులు రసాయనాల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉట్నూర్ నుంచి ఇతర ప్రాంతాలకు బస్సులు పెంచాలి

- బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్



నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ నుంచి అన్ని వైపులా బస్సులను పెంచాలని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ అన్నారు. అనంతరం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉట్నూర్ బస్ డిపోలో బస్‌లను చాలా వరకు తగ్గించారని అన్నారు. ఇలా తగ్గించడం వల్ల ప్రయాణికులు చాలా ఇబ్బందిలకు గురవుతున్నారనీ, మంచిర్యాల నుంచి ఆదిలాబాద్‌కు చివరి బస్సు సాయంత్రం 6 గంటలకు ఉండటంతో దాని తర్వాత బస్సు సౌకర్యం లేకపోవడంతో మంచిర్యాల నుంచి దండేపల్లి, జన్నారం, ఉట్నూర్, ఇంద్రవెళ్లి, గుడిహత్నూర్, ఆదిలాబాద్ ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులు లక్సెట్టిపేట వరకు వచ్చి ఆగిపోవల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఆర్టీసీ అధికారులు దృష్టిలో పెట్టుకొని మంచిర్యాల నుంచి ఆదిలాబాద్‌కు సాయంత్రం అదనంగా 6.30 గంటలకు, 7.00 గంటలకు, 8.00 గంటల వరకు మూడు బస్సులు పెంచి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ యువజన నాయకులు మహమ్మద్ ముజీబ్, సిడాం సోనేరావు, సాజిద్ సిద్దిఖీ, సిడాం లచ్చు ఉన్నారు.

అమ్మ ఆదర్శ పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-తాంసి

అమ్మ ఆదర్శ పనులు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహంతో పాటు బండల్ నాగపూర్ ప్రభుత్వ ఉన్న పాఠశాలను ఎంపీడీఓతో కలిసి డ్రైడే ఫ్రైడేలో భాగంగా పరిశీలించారు. రికార్డులను విద్యార్థులకు అందిస్తున్న భోజన మెనూను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు పాఠశాలల ఆధునీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేయడం జరిగింది. కొనసాగుతున్న పనులు నాణ్యతతో పాటు త్వరగా పనులు పూర్తయ్యే విధంగా చూసుకునే బాధ్యత పాఠశాల సిబ్బందిపైనే ఉంటుందన్నారు. వర్షాకాలంలో ప్రత్యేక శ్రద్ధ చూపి వసతి గృహాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, ఎంపీఓ స్వప్నశీల, కేజీబీవీ ఎస్ఓ సౌజన్య, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ఖానాపూర్

కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పంపిణీ చేశారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 39 కళ్యాణలక్ష్మి, ఆరు షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. త్వరలో రూ.1లక్షతో పాటు తులం బంగారం అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సదర్మట్ కెనాల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
నవతెలంగాణ-పెంచికల్‌పేట్



విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కస్తురిబా గాంధీ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం నిర్దేశించిన బ్రాండ్ సరకులు మాత్రమే వాడాలని సూచించారు. నాణ్యత లేని సరుకులను వాడకూడదన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించినారు. విద్యార్థులను వివిధ సబ్జెక్టుల ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఆయన వెంట పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు, కోఆర్డినేటర్ కటుకం మధుకర్, భాగ్యలక్ష్మి శ్రీనివాస్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

3

కుమురంభీం ఆసిఫాబాద్

శనివారం | జులై 13, 2024 | www.navatelangana.com

జీడిచేను పాఠశాలలో కాగితపు సంచుల దినోత్సవం
నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్



మండలంలోని జీడిచేను ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం కాగితం సంచుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు లావణ్య విద్యార్థులతో కాగితం సంచులు తయారు చేయించారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, రేపటి తరానికి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని బహుమతిగా అందిద్దామని కాగితం సంచుల ఉపయోగం గురించి వివరించారు. ప్లాస్టిక్‌కు బదులుగా బట్ట సంచులు, జనప నారా సంచులను వాడాలని పిల్లలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మానస, సభ్యులు పాల్గొన్నారు.

యువజన సంఘం అధ్యక్షుడిగా ప్రణయ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా ఆవిడపు ప్రణయ్‌ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తుమ్మ రమేష్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ బీసీల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తికి యువజన సంఘం బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. సంఘం బలోపేతంతో పాటు సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. ప్రణయ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన జిల్లా అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం విద్యారంగం, నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు గజ్జల లక్ష్మణ్, బీసీ సంఘం నాయకుడు వీరభద్రచారి, సంతోష్, కోటేష్, సామాజిక కార్యకర్త కల్లూరు ప్రశాంత్ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడికి నిరసన



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నిరసన సందర్భంగా జర్నలిస్ట్‌పై దాడి చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దుస్స ధనంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ జర్నలిస్టులు అని కూడా చూడకుండా రక్షణ కల్పించాల్సిన పోలీసులే దాడులకు పాల్పడడం సిగ్గుచేటని తెలిపారు. దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాజాగౌడ్, సీనియర్ పాత్రికేయులు సయ్యద్ నాజిర్ అలీ, పైడి సంతోష్, అబ్దుల్ జమీల్, రాపల్లి కృష్ణ, మొహమ్మద్ కబీర్ అహ్మద్, ఇందారం శ్రీకాంత్, సంతోష్, చనకపురి శంకర్, ఎర్ర రాజశేఖర్, చంద్రగిరి దాస్, డోంగ్రే రవీందర్, శరత్ చంద్ర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం
నవతెలంగాణ-రెబ్బెన

రెబ్బెన 33/11 సబ్‌స్టేషన్‌లో పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ఇమ్రాన్‌ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12గంటల వరకు మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు
నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 3 నెలల ఉచిత వృత్తి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, కంప్యూటర్ కోర్స్ (డి సి ఏ), స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. కోర్సులకు దరఖాస్తు చేసుకోవలసిన వారు సింగరేణి ఉద్యోగి భార్య పిల్లలు, మాజీ ఉద్యోగుల భార్య పిల్లలు, భూ నిర్వాసితులు, ఏరియాలోని కేకే ఓసీపీ, ఆర్కే ఓసిపి, శ్రావణ్‌పల్లి ఓసిపి ప్రాజెక్ట్ చుట్టుప్రక్కల గ్రామాల మహిళలు ఈ నెల13 నుంచి 22 వరకు జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్మెంట్ సేవాసమితిలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7032878575, 9703279787 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఆర్థిక తోడ్పాటుతో పాటు తులం బంగారం ఇస్తాం
నవతెలంగాణ-జైపూర్

ఆడ బిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి, షాదీముభారక్ పథకం ద్వారా ఆర్థిక తోడ్పాటుతోపాటు తులం బంగారం ఇంచేందుకు ప్రభుత్వం యోచిస్తోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి శుక్రవారం జైపూర్ మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 39 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించిన హామీలు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రకటించిన పథకాలు అర్హులందరి అందనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి పాల్గొన్నారు.



వనమహోత్సవానికి సిద్ధం

- 3.30లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ప్రణాళిక రూపొందించిన అధికారులు
- ముమ్మరంగా సాగుతున్న పనులు



గుంతలు తవ్వుతున్న కార్మికులు



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

నవతెలంగాణ-కెరమెరి

పచ్చదనం పెంచడమే లక్ష్యంగా వనమహోత్సవానికి అధికారులు సిద్ధమయ్యారు. మండలంలో ఈ ఏడాది భారీ లక్ష్యాన్ని నిర్దేశించకుండా నాటిన మొక్కలను సంరక్షించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వనమహోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేపడుతున్నారు. హరితహారంలో నాటిన మొక్కలు కొన్ని చోట్ల ఏపుగా పెరిగాయి. మరికొన్ని గ్రామాల్లో నాటిన ఆనవాళ్లు లేకుండా పోయాయి. ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న చోట మొక్కలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మొక్కల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. గతంలో ఆదేశించినట్లుగా భారీగా మొక్కలు నాటాలని నిర్దేశించిన లక్ష్యాన్ని ఈ ఏడాది సగానికి తగ్గించారు. నాటిన మొక్కలను బతికించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

గుంతలు సిద్ధం...

వనమహోత్సవానికి ఉపాధి హామీ సిబ్బంది రోడ్లకిరువైపులా, చెరువుగట్లపై ఖాళీ ప్రదేశాలలో కూలీలతో గుంతలు తవ్వించి ఫిట్టింగ్ చేయిస్తున్నారు. గ్రామాల వారీగా టార్గెట్ పెట్టుకొని గుంతలు తీసి సిద్ధంగా ఉంచుతున్నారు. గతంలో ఎక్కువ మొక్కలు నాటాలనే లక్ష్యంగా ఉండగా ఈసారి మండల వ్యాప్తంగా 31 గ్రామ పంచాయతీల పరిధిలో 3.30లక్షలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి కెరమెరి, అగర్వాడ నర్సరీతో పాటు మిగతా జీపీలలో మొక్కలు సిద్ధం చేశారు. నర్సరీల బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. ఎప్పటికప్పుడు కార్యదర్శులు నర్సరీలను పర్యవేక్షిస్తూ మొక్కలను సంరక్షిస్తున్నారు. నర్సరీలో సుమారుగా 20రకాల మొక్కలు పెంచుతున్నారు. 5రకాల చొప్పున పండ్లు, పూలు, 10 రకాల నీడనిచ్చే మొక్కలు పెంచుతున్నారు. ఈ సారి మొక్కలకు జియో ట్యాగింగ్ చేస్తున్నారు.

అందరి భాగస్వామ్యంతో..

-అంజత్‌పాషా, ఎంపీడీఓ



వనమహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అందరి భాగస్వామ్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నాం. అన్ని శాఖల పరిధిలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేశాం. లక్ష్యాన్ని చేరేందుకు ప్రజల సైతం భాగస్వాములు కావాలి. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

ఉపాధ్యాయుని వైఖరిపై విద్యార్థుల నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తమ పాఠశాలలో గణితం బోధిస్తున్న ఉపాధ్యాయుని వైఖరిని నిరసిస్తూ మండలంలోని బూరుగూడ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు తరగతులు బహిష్కరించి పాఠశాల ముందు బైటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు గణితం బోధించే ఉపాధ్యాయుడు అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు గణితం బోధనకు ఆ ఉపాధ్యాయుడు అవసరం లేదన్నారు. వెంటనే ఆయనను తొలగించి వేరే ఉపాధ్యాయుని నియమించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు తాము పాఠశాల తరగతులకు హాజరయ్యేది లేదని తెలిపారు. దీనితో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్ విద్యార్థులతో మాట్లాడి సదరు ఉపాధ్యాయులతో వారికి క్షమాపణ చెప్పించారు. పాఠశాలలోని మరొక ఉపాధ్యాయునితో పదవ తరగతికి గణితం బోధింపచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాట్లాడుతూ తాను వ్యక్తిగతంగా ఎప్పుడు విద్యార్థులను దూషించలేదని, విద్యార్థులు సబ్జెక్టు నేర్చుకోవాలనేదే తన తపన అన్నారు. దాని కోసమే విద్యార్థులను తిట్టానే తప్ప ఇతర ఉద్దేశం లేదన్నారు. విద్యార్థులు దాని వ్యతిరేకంగా అర్థం చేసుకున్నారని ఇది తనను కొంత భాదించినట్లు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు ఇచ్చిన హామీతో విద్యార్థులు పాఠశాల లోపలికి వెళ్లారు.

తుమ్మిడిహెట్టిలో మెగా వైద్యశిబిరం



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాగజ్‌నగర్‌లోని షణ్ముఖ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దీన్ని ఎస్పీ డివి శ్రీనివాసరావు ప్రారంభించారు. 200 బ్లాంకెట్స్, 5 వాలీబాల్ కిట్స్, 30 హెల్మెట్స్, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. మారుమూల గ్రామాల ప్రజలు ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకోవడం చాలా ఇబ్బందిగా ఉండడం గమనించి ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశామని తెలిపారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలన్నారు. మావోయిస్టుల గురించి ఈ ప్రాంతం ప్రజలను ఇబ్బందులకు గురి చేయమని చెప్పారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కోసం శిక్షణ ఇవ్వడానికి ఐటిడిఎ, రెవెన్యూ శాఖలను సమన్వయం చేసుకుంటూ సహకరిస్తామని తెలిపారు. వైద్య సదుపాయం సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడ పరీక్షలలో ఏదైన ఆరోగ్య సమస్య ఉంటే బెల్లంపల్లి, మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌కు ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మెగా వైద్య శిబిరంలో డాక్టర్లు తిరుమలేష్, ఉదయసాగర్, దివ్య, కౌశిక్ వైద్య సేవలందించారు. అనంతరం వారికి మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాదిక్ పాషా, ఎస్ఐ మధుకర్, నరేష్, షణ్ముఖ హాస్పిటల్ డాక్టర్ల బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కేజీబీవీ, ఆదర్శ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తు ఉద్యోగ విరమణ పొందుతున్న బోధనేతర మహిళా కార్మికులకు రూ.25లక్షల బెనిఫిట్స్‌తో పాటు పెన్షన్ ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం ఏవో రఫత్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో పనిచేస్తున్న బోధనేతర మహిళా సిబ్బందిని వృద్ధాప్యం పేరుతో తొలగించడానికి వ్యతిరేకిస్తున్నామన్నారు. 20 సంవత్సరాల నుండి ప్రభుత్వ విద్యాసంస్థల్లో పని చేస్తున్న వారికి ఎటువంటి పారితోషికాలు ఇవ్వకుండా తొలగించడం సరైన విధానం కాదన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు పోశన్న, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి పెందూర్ నితిన్, జిల్లా నాయకులు కుర్సెంగ హరిశ్చంద్ర ప్రసాద్, కేజీబీవీ కార్మికులు ధోనే బాయక్క, ఆత్రం లక్ష్మీ, ఐలవేని రాజుబాయి, గడ్డం లక్ష్మీ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని మోట్లగూడ గ్రామంలో గల ఫర్టిలైజర్ దుకాణంలో అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారికి తెలియజేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని పూతపెల్లి గ్రామానికి చెందిన రైతు తెలుగే మల్లేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ మండలంలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నా వ్యవసాయ అధికారి పట్టించుకోవడంలేదని, తన పేరును ఫర్టిలైజర్ దుకాణ యజమానికి చెప్పడంతో ఆయన ఒత్తిడి తీసుకొస్తున్నాడని అన్నారు. ఫర్టిలైజర్ యజమాని ఇంటికొచ్చి గొడవ చేశాడని, కుటుంబానికి ఏమైనా బాధ్యత వహించాలని తెలిపారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మీసేవా కేంద్రానికి 48 దరఖాస్తులు
నవతెలంగాణ - వాంకిడి

మండలంలో మహిళా శక్తి పథకంలో మంజూరైన మీసేవా కేంద్రాలకు 48 దరఖాస్తులు వచ్చినట్టు ఏపీఎం మహేష్ తెలిపారు. మండలానికి ఏడు మీసేవా కేంద్రాలు మంజూరయ్యాయన్నారు. వాంకిడి మీసేవా కేంద్రానికి 10, కమానకు 15, ఇందానీకి 9, బెండారాకు 5, బంబారాకు 4, గోయగావ్‌కు 3, జైత్‌పూర్‌కు 2 చొప్పున దరఖాస్తులు వచ్చినట్టు ఏపీఎం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం
నవతెలంగాణ-కాసిపేట

మండలంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణ లత తెలిపారు. 33/11 కేవీ కొండాపూర్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా కాసిపేట మండలంలో ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తపడాలి



నవతెలంగాణ-జైపూర్

నివాస ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తపడాలని భీమారం ఎంపీడీఓ రాధరాథోడ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వివిధ వార్డుల్లో పర్యటించిన ఆమె నివాసాల్లో ఉపయోగం లేకుండా పడివున్న వస్తువులు పడేయాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో ప్రాణాంతక దోమలు వృద్ధి చెందుతాయని హెచ్చరించారు. పాత టైర్లు, కుండీలు, ఖాళీ సీసాల్లో వర్షపు నీరు చేరి దోమల వ్యాప్తికి దోహదపడుతాయని అన్నారు. పాత పాత్రలు ఉంటే పడవేయాలని, నివాస ప్రాంతంలో వర్షపు నీరు నిల్వకుండా చూసుకోవాలని ప్రతి శుక్రవారం నీటి పాత్రలు ఖాళీ చేసి ఆరబెట్టాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఈ విషయమై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కాచి వడబోసిన నీటిని తాగడంతో పాటు వేడి ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమికి బదులు భూమి ఇవ్వండి

- కలెక్టర్‌ను కలిసిన గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు

నవతెలంగాణ-జైపూర్

బహిరంగ మార్కెట్‌తో సమానంగా నష్టపరిహారం ఇవ్వాలని, లేదంటే భూమికి బదులుగా మరో చోట భూమి ఇవ్వాలని గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.50 లక్షల నుండి రూ.కోటి వరకు వ్యవసాయ భూముల క్రయ విక్రయాలు జరుగుతున్నట్లు వివరించారు. నాగాపూర్-విజయవాడ మధ్య నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో మండల పరిధి టేకుమట్ల, ఎల్కంటి, షెట్‌పల్లి, నర్సింగాపూర్, బెజ్జాల, కుందారం, కిష్టాపూర్, రుమ్మీపూర్, వేలాల, గోపాల్‌పూర్ శివారుల్లో గల విలువైన వ్యవసాయ భూములు నష్టపోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం సొమ్ముతో ఇతర ప్రదేశాల్లో గుంట రెండు గుంటల భూమిని కూడ కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. మండల కేంద్రంలో నిర్మించిన సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్, ఇందారం ఓపన్‌కాస్ట్ గని ఏర్పాటుతో ఇప్పటికే వేలాది ఎకరాల భూమిని వదులుకోవల్సి వచ్చిందని వివరించారు. మిగిలిన భూములను నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటున్న మా భూములు మరో మారు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో నష్టపోవల్సి వస్తోందని ఆవేధన వ్యక్తం చేశారు. ఈ విషయంలో స్థానిక స్థితిగతులు పరిశీలించి బహిరంగ మార్కెట్ రేటును దృష్టిలో పెట్టుకుని న్యాయమైన నష్టపరిహారం చెల్లింపుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నర్సింగరావు, సంతోష్, వినోద్, రాంరెడ్డితో పాటు వివిధ గ్రామాలకు చెందిన బాధిత రైతులు ఉన్నారు.



12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కొమ్ముగూడా నుంచి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి ఆటో ట్రాలీలో తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి 12 గంటలకు పట్టుకున్నట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని ఆటో ట్రాలీని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మదగిన సమాచారం మేరకు మండలంలోని కొమ్ముగూడ గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా ఆటో ట్రాలీలో రేషన్ బియ్యం తరలించడానికి సిద్ధంగా ఉన్న ఆటోని పట్టుకున్నామన్నారు. కొంచెం దూరం నుంచి తమను గ్రహించిన ఆటో డ్రైవర్ తన ఆటో క్లచ్ వైర్‌ను పూర్తిగా తెంపేసి అక్కడ నుంచి పరారైనట్లు తెలిపారు.

కలెక్టర్ ఆకస్మిక పర్యటన

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని, ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి వైద్యుల రికార్డులను పరిశీలించి మాట్లాడారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రిలో శుభ్రతను పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు

విద్యార్థినులకు షీ టీమ్ అవగాహనా సదస్సు



నవతెలంగాణ-వేమనపల్లి

మహిళల రక్షణ భద్రతకి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని షిటీమ్ ఎస్ఐ వి హైమ అన్నారు. శుక్రవారం నీల్వాయి కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్లో ఎస్ఐ శ్యామ్ పటేల్‌తో కలిసి విద్యార్థులకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీ టీమ్స్, మహిళ చట్టాలు, భద్రత, ఆత్మహత్యలపై, ర్యాగింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అమ్మాయిలను వేధింపులు, చదువుపై శ్రద్ధ, సెల్ ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు మొదలగు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాల పట్ల మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించటానికి చదువు తప్ప వేనేకీ మార్గం లేదన్నారు. విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదివి వృత్తిలో నైపుణ్యత సంపాదించుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. అమ్మాయిలని ఎవరైనా వేధింపులకు గురి చేసిన ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేసినట్లు అయితే వెంటనే షీ టీమ్ డయాల్ 100, స్థానిక పోలీసులకు ధైర్యంగా ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అని సూచించారు. ఏటువంటి విషయాలు ఉన్న తల్లిదండ్రుల ద్వారా ధైర్యంగా పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్, భరోసా సెంటర్ సిబ్బంది, కళాశాల స్పెషల్ ఆఫీసర్ మయూరి పాల్గొన్నారు.

ఘనంగా ఫొటో భవన్ ప్రథమ వార్షికోత్సవం



నవతెలంగాణ-మందమర్రి

ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు పసుల వెంకటస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఫోటో భవన్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హాజరయ్యారు. ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఫోటో వీడియో గ్రాఫర్స్ యూనియన్ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఆడెపు అశోక్ కుమార్, కోశాధికారి బద్రి సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వలస మణిరాజ్, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్లకొండ కనకన్న గౌడ్, రాష్ట్ర కార్యదర్శి అప్పాస్ రాము, జిల్లా అధ్యక్షుడు నల్ల సతీష్, శ్రీపతి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోతనమైన తిరుపతి, పసుల రవి, ఆర్ సుజిత్, జూపాక సది పాల్గొన్నారు.

డ్రాపవుట్ విద్యార్థులను పాఠశాలలో చేర్పించిన అధికారులు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పుట్టిగూడ గ్రామానికి చెందిన అజయ్ అనే 14 సంవత్సరాల విద్యార్థి, గత రెండు సంవత్సరాలుగా పాఠశాలకు పోకుండా డ్రాప్ అయ్యాడు. లక్షెట్టిపేట ఆపరేషన్ ముస్కాన్ టీం ఇన్‌చార్జి ఎస్ఐ రామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఆ విద్యార్థిని పట్టుకొని కౌన్సిలింగ్ ఇచ్చి, మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలకు పంపించినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్ ముస్కాన్ టీంలో చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజశేఖర్, లేబర్ ఆఫీసర్ రామ్మోహన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ కేశవ్ పాల్గొన్నారు.

పాఠశాలలో వన మహోత్సవం

నవతెలంగాణ-మందమర్రి

ఆదర్శ పాఠశాల శుక్రవారం వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సింగరేణి నర్సరీ సహకారంతో 100 మొక్కలను నాటారు. 6వ తరగతిలో నూతనంగా ప్రవేశం పొందిన 100 మంది విద్యార్థులకు నాటిన మొక్కలను దత్తత ఇచ్చారు. ప్రతీ రోజు నీరు పోసి వాటిని కాపాడే బాధ్యత వారు తీసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీనరీ ఇన్‌చార్జి విఠల్, అమీర్ పాషా, శేఖర్, పీడీ చిన్నక్క పాల్గొన్నారు.

సేఫ్టీ మెనేజ్‌మెంట్ ప్లాన్‌పై అవగాహన

నవతెలంగాణ-మందమర్రి



సేఫ్టీ మెనేజ్‌మెంట్ ప్లాన్‌పై గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు శుక్రవారం ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్పొరేట్ అంతర్గత భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఏరియా జీఎం మనోహర్ అధ్యక్షతన ఇల్లందు క్లబ్‌లో సింగరేణి వ్యాప్తంగా సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఆవశ్యకత, అమలు పరచటం, కార్మిక సంఘాల పాత్రలపై బెల్లంపల్లి రీజియన్‌లోని మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియాల జీఎంలకు, ఏరియా సేఫ్టీ అధికారులకు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నాయకులకు, గనులు, డిపార్ట్ మెంట్ల ఫిట్ సెక్రటరీలకు, వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్లకు ఒక్క రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ప్రమాదాలలో మరణించిన ఉద్యోగులకు రెండు నిమిషాలు మౌనం పాటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులు హైదరాబాద్ రీజియన్ 2 మైనింగ్ డీఎంఎస్ ఎస్ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ పని ప్రదేశాలలో సేఫ్టీ మెనేజ్‌మెంట్ ప్లాన్‌లను అనుసరించి, గనులు, డిపార్ట్ మెంట్ల వారీగా భద్రతా సూత్రాలను పాటిస్తూ పని చేయాలని, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో మన సేఫ్టీ మన బాధ్యత అని మనతోపాటు మనతోటి కార్మికులకు కూడా రక్షణపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో సింగరేణి వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఇక్కడ సేఫ్టీ మెనేజ్ మెంట్ ప్లాన్ ఆవశ్యకత, దాన్ని అమలు పరచటంలో ట్రేడ్ యూనియన్ పాత్రపై అవగాహన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం సేఫ్టీ కార్పొరేట్ కె గురవయ్య, జీఎం శ్రీరాంపూర్ సంజీవ్‌రెడ్డి, జీఎం బెల్లంపల్లి రవి ప్రసాద్, ఏఐటీయూసీ మందమర్రి ఏరియా బ్రాంచ్ సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి మొగిలి, ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రెటరీ ఎస్ కె బాజిసైదా, మందమర్రి ఏరియా సీఎంఓఏఐ ప్రెసిడెంట్ రమేశ్, శ్రీరాంపూర్ ఏరియా సీఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎంవీఎస్ చంద్రశేఖర్, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ బెల్లంపల్లి మదుసుదన్, బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ రఘుకుమార్, ఆర్జీ-2 రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్‌ఎస్ గుప్త, మందమర్రి ఏరియా సేఫ్టీ అధికారి రవీందర్ పాల్గొన్నారు.

సింగరేణికే బొగ్గు గనులను కేటాయించాలి



నవతెలంగాణ-మందమర్రి

కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి బొగ్గు బ్లాక్‌లను సింగరేణి సంస్థకే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కమిటీ కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ, ఏరియా బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భీమనాథని సుదర్శన్ డిమాండ్ చేశారు. సింగరేణిలోని జీఎం కార్యాలయాల ఎదుట ఐదు రోజు శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ముగియడంతో చివరి రోజు ఏరియా జీఎం కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలలో వారు పాల్గొన్నారు. అనంతరం ఏరియా జీఎం మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిని ప్రయివేట్ పరం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత సింగరేణి కార్మికులు, రాష్ట్ర ప్రజలపై ఉందని తెలిపారు. సింగరేణి పరిధిలోని బొగ్గు క్షేత్రాలను వేలం వేయకుండా, సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రయివేటుపరం చేయాలని కుట్ర చేస్తుందని, అదే గనుక జరిగితే దేశ, రాష్ట్ర ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. సింగరేణి లాంటి ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేట్ పరమైతే రాష్ట్ర ప్రజలు అందరూ రాబోయే రోజుల్లో కూలీలుగా మారి బతకాల్సి వస్తుందన్నారు. సింగరేణికి నూతన బొగ్గు గనులను సాధించేందుకు యూనియన్ ఆధ్వర్యంలో అన్ని కార్మిక సంఘాలను ఐక్యం చేసి, పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఇప్పకాయల లింగయ్య, బ్రాంచ్ జాయింట్ కార్యదర్శి కంది శ్రీనివాస్, అసిస్టెంట్ కార్యదర్శి సోమిశెట్టి రాజేశం, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, డి మనోహర్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి గోపతి సత్యనారాయణ, బ్రాంచ్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకుడు జెట్టి మల్లయ్య, అన్ని గనుల, విభాగాల పిట్ కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-తాండూర్



గ్రామాల్లో డ్రైడేలు పాటిస్తూ ప్రజలకు సీజనల్ వ్యాధులపై పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి గజానంద్ సూచించారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, పరిసరాలు-పరిశుభ్రతపై ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలకు, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు డెంగ్యూ టైఫాయిడ్, మలేరియా లాంటి వైరల్ ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలు, వీదులు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాబట్టి ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బందితో కలసి టీమ్‌లుగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాల-పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి వీదులలోని మురికి కాలువలలో బై-టెక్స్ లాంటి దోమల మందు పిచికారి చేయాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు. వర్షపు నీరు నిలిచి ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వర్షా కాలంలో వారానికి ఒక్కరోజు ఫ్రై డే-డ్రై డే పాటిస్తు నీరు నిలిచిన ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నైనీ బొగ్గు బ్లాకు తవ్వకాలకు ఒడిస్సా సీఎం అంగీకారం

- ఆదేశాలు జారీ, పరిహారం చెల్లింపుపై పలు సూచనలు
- ఒడిస్సా సీఎం కలిసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ-జైపూర్

ఎట్టకేలకు ఒడిస్సా ప్రభుత్వం నైనీ బొగ్గు బ్లాకుల తవ్వకాలకు అంగీకర ముద్ర వేసింది. ఈ విషయమై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం ఒడిస్సా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మంజీని కలిశారు. సింగరేణి సీఎండీ బలరామ్‌తో కలిసి ఒడిస్సా ముఖ్యమంత్రిని కలిసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నైనీ బొగ్గు బ్లాకుల తవ్వకాలకు అనుమతించాలని కోరారు. ఈ మేరకు స్పందించిన ఒడిస్సా ముఖ్యమంత్రి వెనువెంటనే ఒడిస్సా ప్రభుత్వ ఉన్నతాదికారులకు ఆదేశాల జారీ చేశారు. అభివృద్ధి పనుల ప్రారంభంతో పాటు నిర్మాణాలు, నిర్వాసితులకు సంబంధించిన పరిహారం పంపిణీపై అదికారులకు పలు సూచనలు చేసినట్లు సీఎండీ బలరామ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవతో నైనీ బొగ్గు ఉత్పత్తి సాకారం అయ్యిందని పేర్కొన్నారు. 2015 సంవత్సరంలో సింగరేణి కెటాయించిన ఒరిస్సా రాష్ట్రం అంగుల్ జిల్లాలోని నైనీ బొగ్గు గనుల్లో తవ్వకాలు చేపట్టడానికి సహకరించాల్సిందిగా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఒడిస్సా సీఎంను కోరినట్లు తెలిపారు. ఈ మేరకు నైనీ బ్లాకులో సింగరేణి కార్యకలాపాలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు. 2017 సంవత్సరంలోనే సింగరేణికి నైనీ గనులను కెటాయించారని, తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయాలకు సంబదించి గత ప్రభుత్వంలో నాటి బొగ్గు గనుల మంత్రి ప్రహ్లాద జ్యోషిని కలిసి విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేసినట్లు తెలిపారు.



అనారోగ్యంతో విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిదిలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన సెగ్గెం భాగ్యలక్ష్మి(21) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. గతంలో నిర్మల్ పట్టణంలోని వసతీ గృహంలో ఉంటూ డిగ్రీ చదువుతున్న భాగ్యలక్ష్మి సంవత్సర కాలంగా రక్తహీనతతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనారోగ్యం కారణంగా మానసికవేధనకు గురైన భాగ్యలక్ష్మి తరచు కిందపడిపోవడం గుర్తించిన వసతీ గృహం బాధ్యులు తన స్వంత గ్రామమైన మిట్టపల్లిలో ఉండి చదువుకోవాలని సూచించారు. అప్పటి నుంచి మిట్టపల్లిలో తల్లితండ్రుల వద్ద ఉంటూ మంచిర్యాల పట్టణంలో గల డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న భాగ్యలక్ష్మి అనారోగ్యం కారణంగా ఫైనల్ సెమిస్టర్ పరిక్షలకు హాజరు కాకపోవడంతో మరింత మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది ఈ నెల 10న మధ్యాహ్నం ఇంటి నుంచి వెల్లిపోయి మిట్టపల్లి శివారులో గల మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇది గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలాన్ని సందర్శించిన స్థానిక ఏఎస్సై హబీబ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ సతీష్

నవతెలంగాణ-నస్పూర్



వర్షాకాలంలో సంక్రమించే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సతీష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ళ వేణుతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంట్లో, పరిసర ప్రాంతాలలో నీరు నిలువ ఉండడం ద్వారా దోమలు వద్ధి చెందుతాయని అన్నారు. వాటితో డెంగ్యూ, చికెన్ గున్యా, కలరా, మలేరియా, వ్యాధులకు కారణమవుతయాన్నారు. అవి వృద్ధి చెందకుండా ఉండడానికి ప్రతి శుక్రవారం ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించి ఇంట్లో, పరిసర ప్రాంతాల్లో (పగిలిన కుండలు, డబ్బాలు, కొబ్బరి బోండాలు, కులర్స్, టైర్స్, పాత ప్లాస్టిక్ సామాన్లు, డ్రమ్ములు) నీరు నిలువకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతను విధిగా నిర్వహిస్తూ ఆరోగ్యంగా ఉండాలని, పట్టణాన్ని ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో పదవ వార్డు కౌన్సిలర్ శ్రీపతి సుమతి, ఆర్ఓ సతీష్, ఆర్ఐ తిరుపతి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన జర్పుల సుమన్(31) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతుడు సుమన్ తాళ్ళపేటకు చెందిన నిజాం అనే వ్యక్తి నుంచి అప్పు తీసుకున్నాడు. గడువు ముగియడంతో అప్పు చెల్లించాలని సదరు వ్యక్తి ఒత్తిడి చేశాడు. ఈ క్రమంలోనే మృతుడి వాటర్ ప్లాంట్‌కు తాళం వేసి ఆటోను తీసుకెళ్తానని వేధింపులకు గురి చేశాడు. అవమానాన్ని భరించలేక సుమన్ పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడినట్లు తెలిపారు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

26న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 26 ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండల కేంద్రంలో గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ధారింగుల ఎల్లయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో బహిరంగ సభకు సందబందించి కరపత్రాలను విడుదల చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 ఉదయం 10 గంటలకు ఉట్నూరు పట్టణంలో గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు ఉంటుందన్నారు. సాయంత్రం ఐదు గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సభకు గ్రామీణ పేదలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం నిర్మల్ జిల్లా కార్యదర్శి చిందం రాజమౌళి, దండేపల్లి మండల కార్యదర్శి వేముల నరసయ్య, జన్నారం మండల కార్యదర్శి బోడ కిషన్, మహిళా సభ్యురాలు సంధ్యారాణి పాల్గొన్నారు..

లక్షెట్టిపేటలో పోలీసుల కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని గోదావరిరోడ్డు వీకర్‌సెక్షన్ కాలనిలో శుక్రవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 బైకులు, 2 ఆటోలను స్వాధీనం చేసుకొని విచారణ చెప్పట్టారు. ఈ సందర్భంగా సీఐ నరేందర్ మాట్లాడుతూ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహిచడం జరుగుతుందన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదని, వాటికి బానిసై జీవితాన్ని నాశనం చేసుకోకూడదన్నారు. కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి వాహన దారుడు వాహనాల పత్రాలను వాహనంతోపాటు ఉంచుకోవాలని, రాష్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటివి అమ్మితే చాలా పెద్ద నేరమని వాటి జోలికి పోయి కేసుల్లో ఇరుక్కోకుడదని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సతీష్, ఎస్ఐ-2 తానాజీతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని అర్లి, గొడిసెర గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గంగాధర్ ఇంటింటికి తిరిగి గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు సురేఖ, దేవిక, కమల, ఆశా కార్యకర్త, సాయమ్మ, ఐకేపీ సీసీ కావ్య పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ఘనంగా మహాలక్ష్మి పండుగ

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి పండుగను శుక్రవారం కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి పలువురు భక్తులు ముడుపులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యం అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి మొక్కల పంపిణీ



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుమారి గ్రామంలో శుక్రవారం ప్రతి ఇంటిఇంటికి 6 మొక్కలను పంపిణీ చేశామని ఎంపీడీఓ రాజ్ వీర్ తెలిపారు. అనంతరం కుమారి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో శ్రమదాన చేశారు. పాఠశాల ఆవరణలో కలుపు మొక్కలను తొలగించాలని చెత్తాచెదారం ఉండనికుండా పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. అనంతరం వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తగా గ్రామంలోని మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లినామని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ రాజ్ వీర్, ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఓ వసంత్ పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపు కేసులో ఇద్దరికి ఏడేండ్లు జైలు

- రూ.6వేల జరిమానా

నవతెలంగాణ-సారంగాపూర్

వరకట్నం వేధింపు కేసులో ఇద్దరికి ఏడేండ్లు జైలు శిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధిస్తూ శుక్రవారం నిర్మల్ జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి కరుణ కుమార్ తీర్పు వెలువరించినట్టు కోర్టు లైజన్ ఆఫీసర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలం ధని గ్రామానికి చెందిన చేపూరి సౌమ్యకి శ్రీనివాస్‌కి 2016 సంవత్సరంలో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో ఒక లక్ష రూపాయల నగదు మూడు తులాల బంగారం, గృహ సామాగ్రి కట్నంగా ఇచ్చారు. వివాహం అయిన తర్వాత నెల రోజులు ఆమెను బాగానే చూసుకున్నాడు. తర్వాత అదనపు కట్నం రూ.50వేలు తీసుకో రమ్మని భర్త, అత్త, మామ అదనపు వరకట్నం కోసం భార్యను తరుచూ వేధించేవారు. 8అక్టోబర్ 2019న తెల్లవారుజామున సౌమ్య వేధింపులు భరించలేక వారి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు అన్న నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చార్జీషీట్ దఖలు చేసి శుక్రవారం కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా వారు చేసిన నేరం రుజువు కావడంతో మృతురాలి భర్త చేపూరి శ్రీనివాస్‌కి మామ వెంకటస్వామికి నిర్మల్ జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి కరుణ కుమార్ ఏడు సంవత్సరాల కఠిన కారగార శిక్ష రూ.6వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నింధితులకు శిక్ష పడటంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు ఎంతో కృషి చేశారు. కోర్ట్ లైజన్ ఆఫీసర్ ఎఎస్సై డల్లు సింగ్, కోర్టు కానిస్టేబుల్ రాజేందర్‌ని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీకి సన్మానం



నవతెలంగాణ-లోకేశ్వరం

పదవీ కాలం పూర్తిచేసుకున్న మండలంలోని గడ్‌చాంద ఎంపీటీసీ జీవన్‌ను శుక్రవారం గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా బీజేపీ కార్యదర్శి నల్ల రమేష్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు ఎంపీటీసీగా ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బామ్ని మాజీ ఉపసర్పంచ్ వినోద్, యాదవ సంఘం మండలాధ్యక్షుడు రాజేశ్వర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ మండలంలోని బంగారిగూడ, పిప్పల్‌దరి, అంకోలి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్ తిరుపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. సబ్ స్టేషన్ల పరిధిలోని వినియోగదారులందరు సహకరించాలని పేర్కొన్నారు.

భుక్తాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో..

పట్టణంలోని భుక్తాపూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కొరకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. దీనివల్ల భూక్తాపూర్, భాగ్యనగర్, వడ్డెర కాలనీ, క్రాంతినగర్, హమాలీవాడ, తాటిగూడ, మహాలక్ష్మి వాడ, చిలుకూరి లక్ష్మినగర్, జై జవాన్ నగర్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, శివాజీ చౌక్, రైల్వే స్టేషన్ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

సీసీఐ సబ్ స్టేషన్ పరిధిలో...

పట్టణంలోని సీసీఐ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కొరకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. దీనివల్ల సబ్ స్టేషన్ పరిధిలో జీఎస్ ఎస్టేట్, తిర్పెల్లీ, బడ్క మోహెళ్ల, బ్రహ్మణవాడ, పంజేశా ఏరియాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రిమ్స్ సబ్ స్టేషన్ పరిధిలో..

పట్టణంలోని రిమ్స్ సబ్ స్టేషన్ పరిదిలో లైన్‌ల మరమ్మతుల కొరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. దీనివల్ల సంజయ్‌నగర్, షాద్‌నగర్, టీచర్స్‌కాలనీ, ఓల్డ్ హౌసింగ్ బోర్డు, రిమ్స్, ఫిల్టర్ బెడ్, కలెక్టర్‌చౌక్ ఏరియాల్లో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

- సదరం క్యాంప్ సందర్శన
- మొక్కను నాటిన కలెక్టర్
- క్యాంటీన్ పనులను పరిశీలన
- త్వరలో జిల్లాలో సీఎం పర్యటన
- కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌కు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించేలా చూడాలని కలెక్టర్ రాజర్షిషా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను ఆదేశించారు. శుక్రవారం రిమ్స్‌ను కలెక్టర్ సందర్శించారు. ముందుగా ఓపీలో వస్తున్న రోగుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం సదరం క్యాంప్‌లో ఆర్థో పరీక్షలు కొనసాగగా, దాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి డ్రగ్ స్టోర్‌ను సదర్శించి మందుల నిల్వల గురించి అడిగి తెలుసుకుంటూ రిజిస్టర్లను చూశారు. మందుల రికార్డులను సక్రమంగా ఉంచాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ఈ విషయమై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం రిమ్స్ ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. అదే విధంగా రిమ్స్ సూపర్ స్పెషలిటి ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేయనున్న మహిళ శక్తి క్యాంటిన్ పనులను పరిశీలించి అభినందనించారు.

రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి..

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ రిమ్స్‌కు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మందులు కొరత లేకుండా బయట నుంచి కొనుగోళు చేసేందుకు అవకాశం ఉందన్నారు. రిమ్స్ మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. మహిళలను ప్రోత్సహించేల ప్రభుత్వం మహిళ క్యాంటిన్లను ఏర్పాటు చేస్తుందన్నారు. రిమ్స్ లో ఏంఆర్ఐ మిషన్, క్యాథ్ ల్యాబ్, మహిళ శక్తి క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన జిల్లాలో ఉంటుందని, అప్పుడు వీటిని ప్రారంభిస్తారని తెలిపారు. రెండు మూడు రోజుల్లో షెడ్యుల్ వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్, సూపర్ స్పెషలిటీ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ అశోక్, ఇద్రిస్ అక్బానీ, ఆర్ఎంఓ తొడసం చందు. డీఆర్డీఏ సాయన్న, మహిళ సంఘాల నాయకులు సరోజ, ఉన్నారు.

సఖి సేవలపైన అవగాహన ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సఖి కేంద్రం ద్వారా అందించే సేవలపై అవగాహన ఉండాలని సఖీ కేంద్రం లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర, కేస్ వర్కర్ ప్రవీణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జన శిక్షణ సంస్థ ద్వారా కుట్టు మిషన్ శిక్షణ తీసుకుంటున్న మహిళలకు సఖీ కేంద్రం అందించే సేవలపైన సఖి బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సఖీ కేంద్రం అందించే ఐదు రకాల సేవలు కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, వైద్య సేవలు తాత్కాలిక వసతి గురించి అవగాహన ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల, బాలికల చట్టాలు గృహ హింస చట్టం, బాల్యవివాహాల చట్టం, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, భారతీయ న్యాయ సంహిత(బిఎస్ఎస్) చట్టాల గురించి, సఖి కేంద్రంలో వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అత్యవసర సమయాలలో సంప్రదించాల్సిన హెల్ప్ లైన్ నెంబర్లు 181, 100, 1098, 1930 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జెఎస్ఎస్ ఫీల్డ్ ఆఫీసర్ రాజు, శిక్షకురాలు, మహిళలు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి

నవతెలంగాణ-నస్పూర్



తెలంగాణ రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతంలోని బొగ్గు నిక్షేపాలను ప్రభుత్వ రంగ సంస్థ అయినటువంటి సింగరేణి సంస్థకు కాకుండా వేలం వేయడాన్ని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య అన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన 5వ రోజు రిలే నిరాహార దీక్షలను ఆయన పూలమాలలు వేసి దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు నిక్షేపాలను ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి సంస్థ సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. బొగ్గు గనులను వేలం వేయటాన్ని గుర్తింపు కార్మిక సంఘంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సింగరేణి సంస్థకు కేటాయించేంత వరకు ఉద్యమాలను మరింత ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నగేష్, లింగం రవి, మిరియాల రాజేశ్వరరావు, ఫిట్ కార్యదర్శి సంఘం సదానందం, గొల్లపల్లి రామచందర్, నాగేశ్వరరావు, విజయలక్ష్మి, మొగలి లక్ష్మణ్, రమణ, చిలక రాంచందర్, తోట మహేష్, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిక్రూట్‌మెంట్‌పై ఎయిర్ ఫోర్స్ అధికారులు అనిల్ గోస్వామి, ఎస్డీ జాట్ శుక్రవారం పట్టణంలోని బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్‌లో అలాగే ప్రభుత్వ సైన్స్, ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిక్రూట్‌మెంట్ కొరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జులై 8 నుంచి 28 జులై వరకు చేసుకోవచ్చని తెలిపారు. దీనికి సంబంధించి అక్టోబర్ 18న రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే యువతీ, యువకులు 3 జులై 2024 నుంచి 3 జనవరి 2008 మధ్యలో జన్మించిన వారై ఉండాలని సూచించారు. పదోతరగతి, ఇంటర్ అర్హత, రాత పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలనీ, ఉత్తీర్ణత సాధించిన వారికి ఫిజికల్, మెడికల్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీపీఆర్వో తిరుమల విద్యార్థులు ఉన్నారు.

మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం

నవతెలంగాణ-జన్నారం



మొక్కలే మానవ మనుగడకు జీవనాధారమని మండలంలోని కలమడుగు జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి అన్నారు. శుక్రవారం కలమడుగు పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి హరిత తెలంగాణకు సహకరించాలన్నారు. మొక్కలు నాటడమే కాదు వాటిని పూర్తిస్థాయిలో సంరక్షించి వృక్షాలుగా తయారు చేసినప్పుడే మంచి ఫలితం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ఉపాధ్యాయులు, మురిమడుగుల రమేష్, బోర్లకుంట సాగర్, ఆర్ కవిత, ఎం తిరుపతి, ఎం లక్ష్మయ్య, సింధుజ, జోత్స్నా, నరసయ్య, బాబా రావు పాల్గొన్నారు.

స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వ ఉత్తర్వులు 317 కారణంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రిటైర్డ్ ఎంప్లాయిస్ భవన్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల ద్వారా ఏర్పడిన ఖాళీల్లో 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలన్నారు. ఉమ్మడి జిల్లా ప్రకారం నియమించబడి ప్రస్తుతం స్థానికేతర జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల పదోన్నతుల్లో భాగంగా మిగిలిపోయిన ఖాళీల్లో వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైద్యశాంతికుమార్, సోయం ఇందూరావు, సంఘ నాయకులు హేమంత్, రమేష్, రవికుమార్, శ్రీనివాస్, మహిపాల్, ప్రశాంత్, విజయ కుమారి, కవిత, భాగ్య, లలిత పాల్గొన్నారు.

క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ ప్రణీత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్జీఎఫ్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఈ విద్య సంవత్సరలో జరిగే క్రీడాపోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపే విధంగా పీఈటీలు కృషి చేయాలన్నారు. వారికి కావాల్సిన సహకారాన్ని శాఖ తరపున పూర్తిగా అందిస్తామన్నారు. అంతకుముందు ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతరావ్ క్రీడ క్యాలెండర్‌ను విడుదల చేశారు. అనంతరం ఇటీవల పీడీలుగా పదోన్నతులు పొందిన వ్యాయమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి, పేటా టీఎస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి, ఎస్జీఎఫ్ కార్యదర్శి దయనంద్‌రెడ్డి, జక్కుల శ్రీనివాస్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని మన్మథ్ గ్రామ పాఠశాలకు పదోన్నతి, బదిలీపై వచ్చిన వినోద్‌రెడ్డి, నవీన్ కుమార్, విజయ కుమారి, పదోన్నతితో బదిలీపై వెళ్తున్న శైలజ ఉపాధ్యాయులను గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, వీడీసీ అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లలితభోజన్న, పీఆర్టీయూ అధ్యక్షులు రాజారాం, ఎంఈఓ చంద్రకాంత్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మల్కాగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకాపూర్ పాఠశాలలో...

మండలంలోని కనకాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా గత 12 సంవత్సరాలు బాధ్యతలు నిర్వర్తించి సారంగాపూర్ మండలం తాంద్ర(జి) పాఠశాలకు బదిలీపై వెళ్లిన రమేష్‌ను, మండలంలోని గడ్‌చాంద పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రవీందర్‌ను పాఠశాల యాజమాన్యం శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన ప్రధానోపాధ్యాయులు సాయరెడ్డి మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా రమేష్, రవీందర్, తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. వెంకటరమణ, రజిత, అంగన్‌వాడీ కేంద్రం-1 టీచర్ ప్రభ ఉన్నారు.

చెరువును కాపాడి న్యాయం చేయండి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి శివారులోని సర్వే నెం19లో గల చెరువును ఆధారంగా చేసుకొని జీవిస్తున్న దళిత రైతు కటుంబాలకు న్యాయం చేయాలని దళిత రైతులు వేడుకుంటున్నారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ముత్యంపల్లికి చెందిన దళిత రైతులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముత్యంపల్లి శివారులోని సర్వే నెంబర్ 19లో గల చెరువును ఆధారంగా చేసుకొని జీవిస్తున్న రైతు కటుంబాలు ఎన్నో ఉన్నాయని, ఇందులో దళిత రైతు కుటుంబీకులు ఎక్కువ శాతం ఉన్నాయన్నారు. కాని చెరువు నాదే అంటూ నర్సింగ్‌రావు అనే వ్యక్తి ఆ చెరువుకు ఉన్న తూమును, మత్తడిని తవ్వించి చెరువులో ఉన్న నీటిని మొత్తం భయటకు ఒదిలేసి ఆ చెరువులో తను వరి, పలు రకాల పంటలు వేసుకుంటున్నారన్నారు. ఈ విషయమై వారిని అడూగా ఈ చెరువు మాది నేనేమైనా చేసకుంటాను. మీ దిక్కున్నకాడ చెప్పుకోండి అని బెదిరిస్తున్నాడని వాపోయారు. ఈ చెరువుకు గతంలో మిషన్ కాకతీయ కింద రూ.24 లక్షలతో మరమ్మత్తులు చేశారని, ప్రభుత్వం నిర్మించిన చెరువుకు మరమ్మత్తులు చేసిన చెరువును నాదంటూ చెరువు నీళ్లను భూములకు ఇవ్వకుండా ధ్వంసం చేసి, తూము సామాగ్రిని ఎత్తుకొని, చెరువు నీళ్లను వొదిలేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గ్రామీణ పేద బాలికలకు నాణ్యమైన విద్యా సౌకర్యాలు కల్పించాలని జిల్లా విద్యాధికారి పి అశోక్ అదేశించారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకు ముందు నిర్మాణదశలోని భవనాన్ని పరిశీలించారు జనల్ వ్యాధులు సోకుతున్నందున పిల్లల ఆరోగ్యంపట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యాలయ గదులను, పరిసరాలను పరిశీలించారు. డీఈఓ వెంట పరీక్షల సహాయ కమీషనర్ ఉదయబాబు, కోఆర్డినేటర్ కటుకం మధూకర్, భాగ్యలక్ష్మిలు ఉన్నారు.